క్లుప్తంగా

షాదీముబారక్ చెక్కుల పంపిణీ

మలక్‌పేట: ఎమ్మెల్యే అహ్మద్ బలాల పంజేషా హాలోని కార్యాలయంలో బుధవారం చార్మినార్ మండలానికి చెందిన లబ్ధిదారులకు షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. పర్వతీనగర్, కట్టెలమండీ, కాలడేరా కాలనీ, చంచల్‌గూడ, ఆజంపురా ప్రాంతాలకు చెందిన 15 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మొత్తం రూ.15.01 లక్షల విలువైన చెక్కులను అందజేశామని, అర్హులంతా ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధికారులు ఆసిఫ్‌ఖాన్, ముహ్మద్ రిజ్వాన్, ఎంఐఎం నేతలు ఉన్నారు.

ఫొటోగ్రాఫర్ల అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయం


కిషన్ గుప్తాను సన్మానిస్తున్న బండా ప్రకాష్ తదితరులు

నాగోలు: తెలంగాణ ఫొటో, వీడియో గ్రాఫర్ సంక్షేమ సంఘం ప్లీనరీ నగరంలోని శిల్పకళా వేదికలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫొటో, వీడియో గ్రాఫర్ సంక్షేమ సంఘం ఫౌండర్ ప్రధాన కార్యదర్శి వనపర్తి కిషన్ గుప్తాను మంత్రి శ్రీనివాస్ గౌడ్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ సన్మానించి అభినందించారు. సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేసి ఫొటో, వీడియో గ్రాఫర్ల అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు హుస్సేన్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి శైలేందర్, వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకట రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ కార్యవర్గ సభ్యుడిగా వాసు చౌదరి



వనస్థలిపురం: బీజేపీ రంగారెడ్డి (అర్బన్) జిల్లా కార్యవర్గ సభ్యుడిగా వనస్థలిపురానికి చెందిన గన్నమనేని వాసు చౌదరి నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వాసు చౌదరి మాట్లాడుతూ, తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి, కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్, కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

చలివేంద్రాల ఏర్పాటు హర్షణీయం


చలివేంద్రాన్ని ప్రారంభించిన డీసీ మారుతీ దివాకర్, సీఐ జలంధర్

చంపాపేట: వేసవి కాలంలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం హర్షణీయమని ఎల్‌బీనగర్ సర్కిల్ డీసీ మారుతీ దివాకర్ అన్నారు. బుధవారం బీఎన్‌రెడ్డి డివిజన్ ఎన్‌జీవోస్ బస్టాప్ వద్ద గద్దె విజయ్ నేత తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై వనస్థలిపురం సీఐ జలంధర్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు సోమయాజులు, వెంకటేశ్వరరావు, నాయకులు సుబ్బారావు, ప్రభాకర్‌నేత, మూర్తి, జైపాల్, ఎస్సై జగన్ తదితరులు పాల్గొన్నారు.

సమాజహితులను సన్మానించడం అందరి బాధ్యత

సైదాబాద్: విపత్కర సమయాల్లో సహా అన్ని వేళల్లో తమ విధి నిర్వహణను సమర్థవంతంగా నిర్వహించే సమాజహితులను సన్మానించడం అందరి బాధ్యత అని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి అన్నారు. బుధవారం సైదాబాద్ దోభీఘాట్‌లోని లీడ్ ఇండియా స్కూల్ కరస్పాండెంట్ సత్యప్రకాష్ ఆధ్వర్యంలో పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పోలీసులు, వైద్యులు, పారిశుద్ధ్య కార్మికులు, ఉపాధ్యాయులు, జర్నలిస్టులు వంటి వారు తమ రంగాల్లో ఎన్ని అవాంతరాలు వచ్చినా ఎదురొడ్డి పని చేస్తారని కొనియాడారు. అలాంటి వారిని సన్మానించడం వలన వారు ఆయా రంగాల్లో మరింతగా రాణించేలా ప్రోత్సాహం ఇస్తుందన్నారు. అనంతరం ఆమె బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధికార ప్రతినిధి వీరేంద్రబాబు యాదవ్‌తో కలిసి పలువురు పారిశుద్ధ్య కార్మికులు, వైద్యులు, ఉపాధ్యాయులు, జర్నలిస్టులు సాగర్, మధు, అవినాష్ నాయుడు, రాహుల్ కిషోర్, సాయి, నవీన్ పటేల్‌ను సన్మానించారు.

దాహార్తి తీర్చని వాటర్ ఏటీఎంలు

- సాంకేతిక లోపంతో మూలన పడ్డ వైనం
- మరమ్మతులపై జీహెచ్‌ఎంసీ అధికారుల నిర్లక్ష్యం
- వేసవిలో తాగునీటికి అల్లాడుతున్న ప్రయాణికులు, పాదచారులు
- వాటర్ ఏటీఎంలను అందుబాటులోకి తేవాలని విజ్ఞప్తి

నాగోలు: ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేసిన వాటర్ ఏటీఎంలు సాంకేతిక లోపంతో మూలన పడ్డాయి. ప్రస్తుతం వేసవి కాలం కావడంతో తాగునీటి కోసం ఆయా మార్గాల్లో వెళ్లే ప్రయాణికులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాటర్ ఏటీఎంలకు మరమ్మతులు చేయించి వాడుకలోకి తీసుకురావాలని వారు జీహెచ్‌ఎంసీ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.


నాగోలులో పనిచేయని వాటర్ ఏటీఎం


బీఎన్‌రెడ్డినగర్‌లో నిరుపయోగంగా ఉన్న వాటర్ ఏటీఎం

- తక్కువ ఖర్చుతో సిటీజన్ల దాహం తీర్చేందుకు బల్దియా, వాటర్ బోర్డు ఆధ్వర్యంలో నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఐదేళ్ల క్రితం వాటర్ ఏటీఎంలను ఏర్పాట్లు చేశారు.
- ఇందులో భాగంగా ఎల్బీనగర్ నియోజవర్గంలోని నాగోలు, బీఎన్ రెడ్డినగర్, వనస్థలిపురం, లింగోజిగూడ, కొత్తపేట డివిజన్లలోనూ వీటిని నెలకొల్పారు.
- బీఎన్‌రెడ్డినగర్ చౌరస్తా సమీపంలోని షాపింగ్ కూడలి వద్ద, వనస్థలిపురంలోని గణేష్ టెంపుల్, కాంప్లెక్స్‌ల వద్ద, కొత్తపేట, లింగోజిగూడల్లోనూ జీహెచ్‌ఎంసీ, వాటర్ బోర్డు సహకారంతో నేచర్స్ స్ప్రింగ్ ఎకో ట్యాప్,జో సెఫ్ ఎకలాజికల్ వాటర్ సొల్యూషన్స్ స్వచ్ఛంద సంస్థల సంయుక్తాధ్వర్యంలో వాటర్ ఏటీఎంలను ఏర్పాటు చేశారు.
- వీటిని నిర్మించేందుకు 300 చదరపు అడుగుల స్థలాన్ని జీహెచ్‌ఎంసీ సమకూర్చగా, వాటర్ బోర్డు నీటిని ఉచితంగా సప్లయ్ చేసేది.
- ప్రజలు ఈ ఏటీఎంలో రూపాయి కాయిన్ వేస్తే చాలు లీటర్ స్వచ్ఛమైన నీరు బయటకు వచ్చేది. షాపుల్లో లీటర్ వాటర్ బాటిల్ రూ.20లకు విక్రయిస్తుండగా, కేవలం ఒక్క రూపాయికి స్వచ్ఛమైన నీరు లభిస్తుండటంతో ప్రయాణికులు, పాదచారులతో పాటు స్థానికులు ఎక్కువగా వాటర్ ఏటీఎంల్లోని నీటితో తమ దాహార్తిని తీర్చుకొనేవారు.
- అయితే, ఏర్పాటు చేసిన కొద్ది రోజుల తర్వాత వీటి నిర్వహణను జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు పట్టించుకోవడం మానేశారు. ఫలితంగా సాంకేతి లోపం ఏర్పడి పని చేయడం మానేశాయి. మరమ్మతులు చేయించకపోవడంతో వాటర్ ఏటీఎంలు నిరుపయోగంగా మారాయి.
- ప్రస్తుత వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజలకు తక్కువ ఖర్చుతో స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అందుబాటులోకి తీసుకురావాలి



వేసవి కాలంలో తాగునీరు అందుబాటులో లేక అనేక మంది ఇబ్బందులు పడుతున్నారు. గతంలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ ఏటీఎంలు ఎక్కడా పనిచేయడం లేదు. వాటి నిర్వహణను అధికారులు పట్టించుకోకపోవడంతో వాటర్ ఏటీఎంలు వృథాగా మారాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి వాటర్ ఏటీఎంలను అందుబాటులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

– సురేష్, నాగోలు

అర్హులందరికీ న్యాయం చేస్తాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


సమావేశానికి హాజరైన లబ్ధిదారులు

- డీడీ కట్టిన ప్రతి ఒక్కరికీ 'డబుల్' ఇల్లు ఇస్తాం: సుధీర్‌రెడ్డి

హస్తినాపురం: అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి న్యాయం చేస్తామని, కొన్నేళ్ల క్రితం ప్రభుత్వానికి డీడీలు కట్టిన ప్రతి ఒక్కరికీ విడతల వారీగా డబుల్ బెడ్‌రూం ఇళ్లు అందిస్తామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఆయన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డబుల్ ఇళ్ల లబ్ధిదారులతో సమావేశమయ్యారు. హస్తినాపురం నందనవనం కాలనీలో గతంలో దాదాపు 512 ఇళ్లను ప్రభుత్వం నిర్మించిందని, కొంతమంది తాళాలు పగులగొట్టి ఆ ఇళ్లలో అక్రమంగా నివాసం ఉంటున్నారన్నారు. వారితో రెవెన్యూ అధికారులు, పోలీసులు వారితో సమావేశం ఏర్పాటు చేసి ఆ ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోవాలని, మరోచోట ఇల్లు ఇస్తామని చెప్పారన్నారు. కొందరు ఖాళీ చేసి వెళ్లిపోగా, మరికొందరు అధికారులు చూపించిన ఇళ్లలోకి వెళ్లారన్నారు. అయితే, ఇక్కడి నుంచి వెళ్లిన వారు తమకు సరైన సదుపాయాలు లేవని తనతో చెప్పడంతో ఆ విషయాన్ని మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ దృష్టి తీసుకెళ్లానని సుధీర్‌రెడ్డి తెలిపారు. స్పందించిన కేటీఆర్ నందనవనంలోని ఇళ్లలో అక్రమంగా ఉంటున్న వారిని అక్కడే ఉండనీయమని కలెక్టర్‌ను ఆదేశించారని సుధీర్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వానికి డీడీల రూపంలో డబ్బులు చెల్లించిన వారికి మన్సురాబాద్ ఎరుకల నాంచారమ్మ కాలనీ, వనస్థలిపురం రైతుబజార్, హయత్‌నగర్ బొమ్మల గుడి దగ్గర నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయిస్తామని తెలిపారు. చెప్పుడు మాటలు విని ఎవ్వరూ ఆందోళన చెందవద్దని, దళారీల మాటలు నమ్మొద్దని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో హస్తినాపురం డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ఆండోజు సత్యంచారి, నాయకులు నారగోని శ్రీనివాస్‌యాదవ్, డేరింగుల కృష్ణ, రాంచంద్రనాయక్, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

చైతన్యపురి: కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని గౌతంనగర్ కాలనీ సంక్షేమ సంఘ సభ్యులు గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. బుధవారం కాలనీలో పర్యటించిన కార్పొరేటర్ కాలనీలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రహదారులకు మరమ్మతు చేయించాలని, తాగునీటి సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు కోరారు. కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి కల్లెం మధుసూదన్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ జయరాం రెడ్డి, కోశాధికారి విక్రంరెడ్డి, కాలనీవాసులు మోహన్‌రావు, దేవేందర్‌రెడ్డి, మధు, ప్రవీణ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా కాన్వొకేషన్ డే


నాగార్జున స్కూల్‌లో చిన్నారులకు పట్టాలు అందజేస్తున్న వైస్ చైర్మన్ రజనీ విఠల్‌రెడ్డి

హస్తినాపురం: హస్తినాపురం సెంట్రల్ కాలనీలోని నాగార్జున మోడల్ స్కూల్‌లో బుధవారం మాంటిస్సోరీ విద్యార్థుల కాన్వొకేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నాగార్జున విద్యాసంస్థల వైస్ చైర్మన్ గుమ్మకొండ రజనీ విఠల్‌రెడ్డి హాజరై విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. నల్లగౌన్లు ధరించిన చిన్నారులు పట్టాలు అందుకుంటూ సందడి చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపాల్ పద్మావతి, మాంటిస్సోరీ ఇన్‌చార్జి ఉషశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి కృషి

నాగోలు: మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. కొత్తపేటలో మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా హాజరయ్యారు. ముస్లింలతో కలిసి విందులో పాల్గొన్నారు. అనంతరం వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ వజీర్ ప్రకాష్‌గౌడ్, బీఆర్‌ఎస్ కొత్తపేట డివిజన్ అధ్యక్షుడు లింగాల రాహుల్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు రాగిరి ఉదయ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రీజనింగ్ బుక్స్ అందజేత

వనస్థలిపురం: విద్యార్థులు అనుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు నిరంతరం కృషి చేయాలని హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ (హెచ్‌ఆర్‌పీసీ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ ఆర్‌వీ లక్ష్మి అన్నారు. బుధవారం వనస్థలిపురంలో జరిగిన కార్యక్రమంలో సివిల్స్, గ్రూప్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు అవసరమైన రీజనింగ్ బుక్స్‌ను కమిటీ ఆధ్వర్యంలో ఆమె అందజేశారు. కార్యక్రమంలో కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంద సురేందర్‌రెడ్డి, సభ్యులు కె.వెంకట్‌రెడ్డి, ఎస్.వెంకటేశ్వర్లు, బి.యాదగిరి పాల్గొన్నారు.

ఎక్సైజ్ ఠాణాకు మరో వెయ్యి గజాలు కేటాయింపు


స్థలం కేటాయింపు పత్రాలను అందజేస్తున్న తహసీల్దార్ సంధ్యారాణి

హయత్‌నగర్: హయత్‌నగర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌కు మరో వెయ్యి గజాల స్థలాన్ని ప్రభుత్వ కేటాయించింది. ఇందుకు సంబంధించిన పత్రాలను తహసీల్దార్ సంధ్యారాణి బుధవారం సరూర్‌నగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవీందర్‌రావుకు అందజేశారు..ఈ సందర్భంగా ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌గౌడ్ మాట్లాడుతూ, గతంలోబాగ్ హయత్‌నగర్ సర్వే నం. 59లో కేటాయించిన వెయ్యి గజాలకు అదనంగా అక్కడే మరో వెయ్యి గజాలను కేటాయించారన్నారు. ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆదేశాల మేరకు త్వరలోనే ఇక్కడ ఎక్సైజ్ కార్యాలయాన్ని నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ హనుమంతరావు, శశిధర్, సీఐ కల్పన ఆర్‌ఐ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి అష్టలక్ష్మీ ఆలయ బ్రహ్మోత్సవాలు


బ్రహ్మోత్సవాల కరపత్రాలను విడుదల చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ వాసవి కాలనీలోని అష్టలక్ష్మీ ఆలయ 27వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 21 నుంచి 27 తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్ గుప్తా, చైర్మన్ సోమ సురేష్ తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం వారు ఆలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈనెల 21 నుంచి 27వ తేదీ వరకు జరిగే ఉత్సవాల్లో భాగంగా తిరుచి పల్లకీ సేవ, శేష వాహన సేవ, హంస వాహన సేవ తదితర సేవలతో పాటు చిన్న , పెద్ద రథోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఐదు రోజుల పాటు సుదర్శనేష్టి, వరాహేష్టి, హయగ్రీవేష్టి, నృసింహేష్టి, లక్ష్మి నారాయనేష్టి కార్యక్రమాలు నిర్వహిస్తామని, భక్తులు సాంప్రదాయ దుస్తుల్లో పాల్గొనాలని కోరారు. ప్రతిరోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు అభిషేకాలు ఉంటాయని, 24న శ్రీ లక్ష్మీనారాయణ కల్యాణ మహోత్సవం, జగద్గురు ఆది శంకరాచార్య జయంతి మహోత్సవం, 27న 108 వెండి కలశాలతో అభిషేకాలు శాస్త్రయుక్తంగా నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో ఆలయ ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి ఐతే అంజయ్య గుప్తా, బ్రహ్మోత్సవ కమిటీ కన్వీనర్ గౌరిశెట్టి అరుణ్, ధర్మాధికారి జయశంకర్ బాలగోపాల్, ఆలయ కమిటీ సభ్యులు చిలుక ఉపేందర్‌రెడ్డి, బొగ్గరపు రవీందర్, దాచేపల్లి శ్రీనివాస్, తమ్మన శ్రీధర్, శ్రీకాంత్ గాండే, ఉమాపతి, దామోదర్ గుప్తా, వనం యాదయ్య గుప్తా తదితరులు పాల్గొన్నారు.

మాటలకే పరిమితమైన అభివృద్ధి: సామ


అల్తాఫ్‌నగర్‌లోని నాలాను పరిశీలిస్తున్న రంగారెడ్డి

లింగోజిగూడ: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో అభివృద్ధి ఎమ్మెల్యే మాటల్లో తప్ప భౌతికంగా ఎక్కడా కనిపించడం లేదని బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆరోపించారు. లింగోజిగూడ డివిజన్ పరిధిలోని అల్తాఫ్‌నగర్‌లో బుధవారం స్వశక్తికరణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన స్థానికులతో కలిసి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డివిజన్‌లో చేపట్టిన బాక్స్ డ్రెయిన్ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోందని, పనులను మధ్యలోనే నిలిపివేస్తుండంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. ముంపు సమస్యతో ఇప్పటికే చాలా మంది కాలనీల్లోని తమ ఇళ్లను వదిలేసి వేరే ప్రాంతాలకు వెళ్లారని, వచ్చే వర్షాకాలంలో కూడా ప్రజలకు వరద ముంపు సమస్య తప్పేలా లేదని అన్నారు. అభివృద్ధి కోసం పార్టీ మారని అని చెప్పే ఎమ్మెల్యే ఎలాంటి అబివృద్ధి చేశాడో చెప్పాలని రంగారెడ్డి డిమాండ్ చేశారు. అవేర్ గ్లోబల్ ఆసుపత్రి వద్ద నాలాను 600 మీటర్లు నిర్మించి లేవల్ కలవడం లేదని, 60 మీటర్లు మధ్యలోనే నిలిపివేసి పూడ్చేశారని ఆరోపించారు. అల్తాఫ్‌నగర్ వెంటనే డ్రైనేజీ పనులను చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాలనీ వాసులు కృష్ణారెడ్డి, కిరణ్‌యాదవ్, ఈశ్వర్‌యాదవ్, భరత్, నరసింహ, వైభవ్, నాయకులు విజయ్‌భాస్కర్, కృష్ణంరాజు, నాగరాజు, రాకేష్, గట్టురవి, కృష్ణగౌడ్, ప్రశాంతి, గణేష్ పాల్గొన్నారు.

ప్రమాదం జరిగితే మనోస్థైర్యం కోల్పోరాదు

మలక్‌పేట: తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవలశాఖ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మలక్‌పేట ఫైర్ స్టేషన్ ఆధ్వర్యంలో బుధవారం అగ్నిప్రమాదాల నివారణపై పెట్రోల్ పంపుల్లోని సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ పద్ధతులను డెమో ద్వారా వారికి వివరించారు. ఫైర్ ఆఫీసర్ ఎండీ ముస్తాఫా మాట్లాడుతూ, ప్రమాదంలో ప్రకృతి వైపరీత్యాల్లో ప్రాణనష్టం జరగకుండా కాపాడటమే ధ్యేయంగా అగ్నిమాపక శాఖ పని చేస్తోందన్నారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు కంగారుపడొద్దని, మనోస్థైర్యం కోల్పోవద్దని అన్నారు. జాగ్రత్తగా వ్యవహరించి దగ్గరలో ఉన్న అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

'బహుజన రాజ్యంలో మహిళలకు అధిక ప్రాధాన్యం'

మన్సూరాబాద్: రాబోయే బహుజన రాజ్యంలో మహిళలకు అధిక ప్రాధాన్యం ఇస్తామని బీఎస్పీ ఎల్‌బీనగర్ అధ్యక్షుడు గువ్వల సాయిరామకృష్ణ అన్నారు. మన్సూరాబాద్‌కు చెందిన పలువురు మహిళలు బుధవారం సావిత్రీబాయి పూలే విగ్రహం వద్ద బీఎస్పీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి కాటేపాక రమేష్, ప్రధాన కార్యదర్శి వేముగంటి సంపత్‌ల సమక్షంలో బీఎస్పీలో చేరారు. ఈ సందర్భంగా సాయిరామకృష్ణ మాట్లాడుతూ, డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆలోచన విధానాలు మెచ్చి పలువురు ఇతర పార్టీల నుంచి బీఎస్పీలో చేరుతున్నారన్నారు. అనంతరం దాసూరి మాధవిని మన్సూరాబాద్ డివిజన్ బీఎస్పీ కన్వీనర్‌గా నియమించి నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఇందు, కవిత, పద్మనేత, లక్ష్మి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఐఎస్‌సదన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం


సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్ శ్వేతామధుకర్‌రెడ్డి, అధికారులు

సైదాబాద్: డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లో సమగ్ర మౌలిక వసతులు కల్పించి ఐఎస్‌సదన్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం డివిజన్‌లోని సింగరేణి కాలనీ కమ్యూనిటీహాల్‌లో సింగరేణి కాలనీ వాంబే గృహ వాసులు, గుడిసెవాసులు, వివిధ ప్రభుత్వశాఖల అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. వాంబే గృహ సముదాయాల్లో, సింగరేణి కాలనీలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను వారు అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, వాంబే గృహాల నడుమ నిత్యం డ్రైనేజీలు పొంగిపొర్లుతూ స్థానికులు ఇబ్బందులకు గురవుతన్నారన్నారు. సింగరేణి కాలనీలో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపర్చాలన్నారు. సింగరేణిలో ఇటీవల అక్రమంగా మద్యం విక్రయాలు, అసాంఘిక కార్యక్రమాలు తీవ్రమయ్యాయని, వాటిని అరికట్టాలని పోలీసులను కోరారు. స్థానికులు తెలిపిన సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. సమావేశంలో డీసీ నర్సింహ, డీపీఓ రత్తమ్మ, ఏఈ అన్సారి, ఎస్‌ఐ శివాజీ, బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, అజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

చాదర్‌ఘాట్: వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడంతో పాటు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తిరుమల బ్యాంక్ చైర్మన్ నంగునూరి చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మలక్‌పేటలోని తిరుమల బ్యాంక్‌లో హైదరాబాద్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. దాదాపు 200 మంది వినియోగదారులు పాల్గొని సాధారణ వైద్య పరీక్షలు, యూరాలజీ, ఫిజియోథెరపీ పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రవిశంకర్, వైద్యులు కల్యాణ్‌రెడ్డి, మారుతీరామ్, గంగాధర్, సురేష్ పాల్గొన్నారు.

సమన్వయంతో సమస్యలను పరిష్కరించాలి

వనస్థలిపురం: వివిధ శాఖల అధికారులు సమన్వయంతో కాలనీల్లోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని హైకోర్టు కాలనీలో కార్పొరేటర్ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు కాలనీలో నెలకొన్న రోడ్లు, శానిటేషన్, వీధి దీపాలు తదితర సమస్యలను ఆయా విభాగాల అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీనికి స్పందించిన కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి, హయత్‌నగర్ సర్కిల్ డీసీ మారుతీ దివాకర్‌లు మాట్లాడుతూ, సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఈ నరేంద్రతేజ, శానిటేషన్ జవాన్ యాదయ్య, కాలనీ వాసులు పాల్గొన్నారు.

జల్సాలకు అలవాటుపడి బైక్ చోరీలు

- నలుగురు బాలురు అరెస్టు
- నాలుగు బైక్‌లు స్వాధీనం

హస్తినాపురం: జల్సాలకు అలవాటుపడిన నలుగురు బాలురు బైక్ చోరీలకు పాల్పడి పోలీసుకు చిక్కారు. వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ జలేంధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఒకే కాలనీకి చెందిన నలుగురు బాలురు సిగరెట్లు, మద్యం వంటి వ్యసనాలకు బానిసయ్యారు. అవసరమైన డబ్బులు సులువుగా సంపాదించవచ్చనే దురాలోచనతో రాత్రి సమయాల్లో ఇంటి ముందు పార్క్ చేసి ఉన్న బైక్‌లను దొంగిలిస్తున్నారు. ఎస్‌కేడీ నగర్‌లో నివాసం ఉండే మోగావత్ బాలకృష్ణ ఈనెల 11వ తేదీ రాత్రి తన బైక్‌ను ఇంటి ముందు పార్క్ చేయగా గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉండగా, బుధవారం ఉదయం వనస్థలిపురం సుష్మా థియేటర్ దగ్గర పోలీసులు వాహనాలను తనిఖీలు చేస్తుండగా, నలుగురు మైనర్ బాలురు బైక్‌పై వెళ్తున్నారు.వారిని ఆపిన పోలీసు వాహన పత్రాలు చూపించమని అడగ్గా.. పారిపోవడానికి యత్నించారు. పోలీసులు వారిని పట్టుకొని విచారించగా బైక్ చోరీ చేసి పట్టుకొచ్చామని చెప్పారు. కమలానగర్, సెల్ఫ్ ఫైనాన్స్ కాలనీ, శ్రీసాయినగర్ కాలనీల్లో మూడు బైక్‌లు చోరీ చేశామని, వాటిని అమ్ముకుందామని ఇంటి దగ్గర దాచి ఉంచామని చెప్పారు. మొత్తం నాలుగు బైక్‌లు స్వాధీనం చేసుకొని నిందితులను అరెస్టు చేసి జువైనల్ హోంకు తరలించామని సీఐ తెలిపారు.

జలమండలి అధికారి వల్లే సమస్య పరిష్కారంలో ఆలస్యం

మన్సూరాబాద్: జలమండలి అధికారి రాజకీయం చేయడం వల్లే వివేకానందనగర్ కాలనీలోని డ్రైనేజీ సమస్య పరిష్కారంలో ఆలస్యమవుతోందని హెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి మండిపడ్డారు. డ్రైనేజీ మురుగు వల్ల భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయని కాలనీవాసుల ఫిర్యాదుతో బుధవారం కార్పొరేటర్ సంబంధిత అధికారులతో కలిసి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, కాలనీవాసులు భూగర్భ జలాలను వాడుకోలేని స్థితిలో ఉన్నారని, షార్ట్ టెండర్ వేసి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని అధికారులను కోరారు. జలమండలి అధికారికి క్షేత్రస్థాయిలో అవగాహన లేకపోవడం, సమస్య తీవ్రతను వివరించినా నిర్లక్ష్యం చేయటంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు తమ విధులను విస్మరించి రాజకీయాలు చేయటం మానుకోవాలని హితవుపలికారు. కార్యక్రమంలో కాలనీవాసులు రవిచంద్ర, సుబ్బారావు, జలమండలి మేనేజర్ ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్ ఏర్పాటుకు స్థల పరిశీలన

డివిజన్ పరిధి సహారాస్టేట్స్ కాలనీలో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి కాలనీవాసులతో కలిసి బుధవారం స్థల పరిశీలన చేశారు. అనంతరం జడ్జెస్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన షటిల్‌కోర్టును పరిశీలించి అక్కడ ఉన్న వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు.